క్లుప్తంగా

దసరా శుభాకాంక్షలు



కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

బనగానపల్లె : నియోజకవర్గంలోని ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దసరా పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని, రైతులు పాడి, పంటలు సమృద్ధిగా పొందాలని, మంచి ధర లభించి లాభాల బాట పట్టాలని ఆకాంక్షించారు.

ముగిసిన వృత్తి విద్య శిక్షణ



సబ్‌స్టేషన్‌లో విద్యార్థులతో ట్రైనర్

అవుకు(కొలిమిగుండ్ల): మోడల్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు దసరా సెలవుల్లో చేపట్టిన ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ముగిసిందని ప్రిన్సిపాల్ హేమీమా బుధవారం తెలిపారు. ఎలక్ట్రానిక్ విభాగంలో విద్యార్థులు విద్యుత్ సబ్‌స్టేషన్, వివిధ రకాల ఎలక్ట్రానిక్ షాపుల్లో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం చేశారు. వృత్తి విద్యపై అవగాహన కల్పించేందుకే ఆసక్తి ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి శిక్షణ పంపామని చెప్పారు.

ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన బాణా లక్ష్మీసాగర్‌రెడ్డి ధర్మపత్ని బాణా శారద కుటుంబ సభ్యులు రూ.50వేల విరాళాన్ని అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ మేరకు దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి ప్రసాదాన్ని ఆలయ అర్చకులు అందజేశారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి



నూతన ఉపాధ్యాయులను సన్మానించిన యూటీఎఫ్ నాయకులు

ప్యాపిలి: ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని డోన్ ఎంఈఓ రఘునాయక్ సూచించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నూతన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ ప్యాపిలి మండలం నుంచి ఎంపికైన 35 మంది ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని కోరారు. నాయకులు రమేశ్ నాయుడు, సుబ్బారెడ్డి, ఎస్ఎస్ బాబు, సుబ్బరాయుడు, అబ్దుల్ లతీఫ్, లక్ష్మీనాయక్, జనవిజ్ఞాన వేదిక నాయకులు మాణిక్యం శెట్టి, రామ్మూర్తి, సర్వజ్ఞ మూర్తి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మొబైల్ వ్యాన్ ద్వారా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ పరీక్షలు, సలహాలు, సూచనలు, మందులు ఉచితంగా పొందవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎయిడ్స్‌పై సరైన అవగాహన లేకపోవడం వల్లే ఈ వ్యాధిబారిన పడుతున్నారని చెప్పారు. ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసులు, స్వచ్ఛంద సంస్థ ఓఆర్‌డబ్ల్యూలు నరసింహ, సుమలత, పీఈ అరుణమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేకు 35 గ్రామాల ఎంపిక

నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ×ఆంధ్ర ప్రదేశ్ – రీ సర్వే ప్రాజెక్ట్‌×లో మూడవ ఫేస్‌లో నంద్యాల జిల్లాలో 35 గ్రామాలు ఎంపిక అయ్యాయని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ బుధవారం తెలిపారు. రీ సర్వేలో భాగంగా ఈ నెల 3వ తేదీ నుంచి ఎంపిక చేయబడ్డ గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఈ సందర్భంగా సంబంధిత రైతులందరికీ నోటీసులు అందజేసినట్లు తెలిపారు. సంబంధిత గ్రామాల రైతులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లు, ఫొటోలు మరియు ఇతర సాంకేతిక వివరాలను సర్వే బృందానికి అందించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు. బుధవారం డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభా వంతుల వయో వృద్ధుల సహాయ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామికి వినతి పత్రాన్ని అందజేశారు.

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా

- కూటమి నేతల వేధింపులకు భవిష్యత్‌లో శిక్ష తప్పదు
- ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని కూటమి సర్కారు
- గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలి
- కార్యకర్తలతో కాటసాని రామిరెడ్డి



మాట్లాడుతున్న కాటసాని రామిరెడ్డి



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కోవెలకుంట్ల: టీడీపీ, జనసేన శ్రేణుల దాడులు, పోలీసులు, ఇతర అధికారుల దౌర్జన్యాలతో ఇబ్బందులకు గురవుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు డిజిటల్ బుక్ కొండంత భరోసా కల్పిస్తుందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. పట్టణ శివారులోని మార్కెట్ యార్డు ఎదురుగానున్న భవన సముదాయంలో బుధవారం సాయంత్రం పార్టీ మండలస్థాయి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందుకు బనగానపల్లె, నంద్యాల నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు భూమా కిశోర్‌రెడ్డి, కర్నూలు పార్లమెంట్ కో ఆర్డినేటర్ కర్రా హర్షవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో కాటసాని మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ బుక్ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న రెడ్‌బుక్ కంటే పవర్‌ఫుల్ అని అన్నారు. ఎక్కడైనా పార్టీ శ్రేణులకు అన్యాయం జరిగితే వెంటనే క్యూ ఆర్ కోడ్ స్కాన్‌చేసి అందులో వివరాలు నమోదు చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే డిజిటల్ బుక్‌లో నమోదైన వివరాలతో ఇబ్బందులకు గురి చేసిన కూటమి నేతలు, అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తే కూటమి సర్కార్ రైతులను పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రస్తుతం రైతులకు యూరియా సైతం దొరకని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గతంలో సచివాలయాలు, ఆర్‌బీకేలు తదితర భవనాలు కట్టిస్తే.. ప్రస్తుతం అధికార పార్టీల నేతలు వాటిలో కూర్చొని ప్రజలపై పెత్తనం చెలాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్యకర్తలదే భవిష్యత్: రాబోయే రోజుల్లో పార్టీ కార్యకర్తలకు మంచి భవిష్యత్ ఉందని కాటసాని రామిరెడ్డి అన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు గ్రామస్థాయి నుంచి పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న కమిటీలతో పాటు ప్రతి గ్రామంలో మహిళా, యువత, రైతు విభాగ కమిటీలను నియమించనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 8,500 మందికి వివిధ హోదాల్లో పార్టీ పదవులు దక్కుతాయన్నారు. కార్యకర్తలు పార్టీ పదవుల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పదవులు పొందిన వారికి ఈ ఏడాది చివరి నాటికి పార్టీ అధ్యక్షుడి సంతకంతో కూడిన ఐడీ కార్డులు అందజేస్తామని తెలిపారు. భూమా కిషోర్‌రెడ్డి, కర్రా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల రక్షణకే డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తెచ్చారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బీవీ ప్రసాదరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుధాకర్‌రెడ్డి, మండల కో ఆప్షన్‌మెంబర్ దిల్కాబాషా, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, జోళదరాశి, అమడాల సర్పంచ్‌లు ఉప్పరి నాగేంద్ర, బాలమద్దిలేటి, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, ఎల్ఐసీ రామసుబ్బారెడ్డి, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మల్లు హరినాథరెడ్డి, డీవీ శేషిరెడ్డి, ఏర్వ శేషిరెడ్డి, మోహన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, అందె శ్రీనివాసరెడ్డి, లోకేశ్వరరెడ్డి, నాగార్జునరెడ్డి, రఘునాథరెడ్డి, సుధాకర్‌రెడ్డి, అక్బర్‌బాషా, శ్రీరాముల అబ్రహం, అమడాలశంకరయ్య, భాస్కర్‌రెడ్డి, ఉప్పరి సుబ్బరాయుడు, సుదర్శన్‌రెడ్డి, యువజన , విద్యార్థి విభాగాల అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అందరికీ మంచి జరగాలి



బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఆర్థికశాఖ మంత్రి

బేతంచెర్ల: జగన్మాత అయిన దుర్గాదేవి ఆశీస్సులతో అందరికి మంచి జరగాలని ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం కోరారు. గురువారం విజయదశమి సందర్భంగా డోన్ నియోజకవర్గంలోని డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల రైతులు, వ్యాపారులు, కార్మికులు సంపదలు, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు.

రీ సర్వేకు సహకరించండి

బేతంచెర్ల: రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రీ సర్వేకు రైతులు సహకరించాలని ఆర్డీఓ నరసింహులు తెలిపారు. బుధవారం మండలంలోని ఆర్.కొత్తపల్లె గ్రామంలో తహసీల్దార్ నాగమణి ఆధ్వర్యంలో రీ సర్వేకు సంబంధించి రైతులతో గ్రామ సభ నిర్వహించారు. రీ సర్వే గురించి రైతులకు సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి వివరించారు. ఎంపీటీసీ మునేశ్వర్ రెడ్డి, ఆర్.బుక్కాపురం సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ



కోవెలకుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిన కారణంగా వివిధ వస్తువుల ధరలు తగ్గడంపై స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ వరప్రసాదరావు, మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ ప్రకాష్‌నాయుడు, తదితరులు జీఎస్టీ 2.0పై ర్యాలీ చేపట్టారు. ఏఓ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వ్యవసాయ రంగానికి ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ట్రాక్టర్లు, వాటి పరికరాలు, టైర్లు, బిందుసేద్య పరికరాలు, బయోపెస్టిసైడ్స్, తదితర ధరల్లో అందుబాటులోకి వచ్చాయన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



వాసవీమాత పూజల్లో పాల్గొన్న బుగ్గన అర్జున్ అమర్నాథ్‌రెడ్డి

డోన్: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, మిట్టా రవి, పాలుట్ల రఘురాం, మేడా రఘు, బచ్చు చక్రి తదితరులు ఆయనను ఆహ్వానించి అమ్మవారి దర్శనానంతరం సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, పార్టీ వలెంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, పార్టీ ఉపాధ్యక్షుడు కురుకుంద హరి, యువజన నాయకులు ఆర్ఈ రాజవర్ధన్, మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు పాలుట్ల మీనాక్షి, మిట్టా ఉమామహేశ్వరి, సంఘం నాయకులు రంగయ్య, కొట్రా రజిని, జొన్నలగడ్డ శ్రీనులు ఉన్నారు.



బేతంచెర్లలో చండీ హోమంలో పాల్గొన్న భక్తులు,(ఇన్‌సెట్‌లో) దుర్గా దేవి అలంకారంలో వాసవీ మాత

వైభవంగా చండీ హోమం

బేతంచెర్ల: స్థానిక అమ్మవారిశాలో దసరా నవ రాత్రుల సందర్భంగా బుధవారం చండీ హోమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేదపండితులు సాయి కిరణ్ , పవన్ కుమార్ శర్మ శాస్త్రోకంగా హోమం జరిపించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. లోక కళ్యాణర్థం హోమం నిర్వహించినట్లు సంఘం నాయకులు తెలిపారు. అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే..పట్టణంలోని గౌరిపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని అశ్వ వాహనంపై ఊరేగించారు.

దసరా సందడి



బేతంచెర్లలో బంతిపూలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



కొనుగోలు దారులతో కిక్కిరిసిన మెయిన్ బజారు

బేతంచెర్ల: గురువారం జరుపుకోనున్న దసరా పండుగ సందర్భంగా పట్టణంలోని మార్కెట్ ప్రాంతాలు బుధవారం కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా పండుగకు అవసరమైన సామగ్రి కొనుగోలు కోసం పట్టణ వాసులతో పాటు వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఆయా కూడళ్లలో బంతిపూలు,అరటి,మామిడి ఆకులు,కుంకుమ విక్రయాలు జోరుగా సాగాయి.



ప్రధాన రహదారిపై భారీగా చేరిన వర్షపు నీరు

రోడ్డుపై నీరు.. వాహనదారుల బేజారు

బనగానపల్లె: పట్టణంలోని అవుకు మెట్ట నుంచి తాడిపత్రి, అనంతపురం వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే చాలు అవుకుమెట్ట సమీపంలోని ముస్లిం మైనార్టీ శ్మశానం వద్ద రహదారిపై రెండు మూడు రోజులు నీరు నిలిచిపోతుందని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని రహదారిపై నీరు నిలవకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

దుష్ట సంహారిణి.. మహిషాసుర మర్దిని

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో అమ్మవారిని అర్చకులు, పూజారులు మహిషాసురమర్దిని, సిద్ధిధాత్రి , కంచి కామాక్షి తదితర రూపాల్లో అలంకరించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



కోవెలకుంట్ల : మహిషాసుర మర్దినిగా మారెమ్మ



కోవెలకుంట్లలో కంచి కామాక్షిదేవి అలంకరణలో వాసవీమాత



ప్యాపిలిలో మహిషాసుర మర్దినిగా వాసవీమాత



నందవరంలో సిద్ధిధాత్రి అలంకారములో చౌడేశ్వరి దేవి



రాజరాజేశ్వరిదేవిగా వాసవీమాత



అంకిరెడిపల్లెలో మహిషాసురమర్దినిగా అమ్మవారు



బేతంచెర్ల: మద్దిలేటి క్షేత్రంలో మహిషాసుర మర్దినిగా మహాలక్ష్మి దేవి



అవుకులో మంగళగౌరి అలంకరణలో వాసవీమాత



కొండపేటలో మహిషాసుర మర్దినిగా దుర్గాదేవి



సంజామలలో కంచి కామాక్షి దేవిగా అమ్మవారు



ఆయుధ పూజ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాస్



ఆర్టీసీ డిపోలో..

ఘనంగా ఆయుధ పూజ



అగ్నిమాపక కేంద్రంలో..



విద్యుత్ శాఖ కార్యాలయంలో..

డోన్ టౌన్ : దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గాష్టమిని పురస్కరించుకొని ప్రజలు, వ్యాపారులు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఘనంగా ఆయుధ పూజలు నిర్వహించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, పట్టణ పోలీసు స్టేషన్‌లలో సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్,ఎస్ఐలు నరేంద్రకుమార్,మమత, తహసీల్దార్ కార్యాలయంలో రవికుమార్, వీఆర్వో మల్లారెడ్డి రెవెన్యూ రికార్డులకు,ఆర్టీసీ డిపోలో మేనేజర్ శశిభూషణ్, అగ్నిమాపక కేంద్రంలో రంగస్వామి గౌడ్, విద్యుత్‌శాఖ కార్యాలయం, రైల్వే స్టేషన్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయుధ పూజ చేశారు.

ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించడం తగదు



మాట్లాడుతున్న ఎస్టీటీఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమాన్ని విస్మరించడం కూటమి ప్రభుత్వానికి తగదని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధాకర్, కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన విధంగా ప్రభుత్వం మధ్యంతర భృతి, పీఆర్సీ బకాయిలు, డీఏలు, విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశతో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం మెమో 57ను అమలు పరుస్తూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. 12వ వేతన సంఘాన్ని నియమించి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, సంపాదిత సెలవు బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం చేయకుండా పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధరణి ఉపేంద్రుడు, సంయుక్త కార్యదర్శి మత్యనాయక్, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా గౌరవాధ్యక్షులు కేషాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రబీ సీజన్ ప్రారంభం

కొలిమిగుండ్ల: జూన్‌లో ప్రారంభమైన ఖరీఫ్ సీజన్ ముగిసింది. బుధవారం నుంచి రబీ సీజన్ ఆరంభమైంది. డిసెంబర్ నెలాఖరు వరకు రబీగా పరిగణిస్తారు. ఈ సీజన్‌లో ప్రధానంగా శనగ సాగవుతుంది. వర్షాలు ఆశించిన మేర కురవడంతో రైతులు పొలాలను ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. మండలంలో పది వేల ఎకరాల్లో శనగ సాగయ్యే అవకాశాలున్నాయి. రబీ ప్రారంభమైనా ప్రభుత్వం సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ ప్రారంభించలేదు. పైగా సబ్సిడీ 25 శాతం ప్రకటించడంతో అన్నదాతలు అనాసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో కిలో రూ.55 ఉండగా, ప్రభుత్వం రూ.58 ప్రకారం ఇస్తుండటమే ఇందుకు కారణం. మండలానికి 3,500 క్వింటాళ్లు అవసరమని వ్యవసాయాధికారులు నివేదికలు పంపారు.

జిల్లాకు 5,32,570 స్మార్ట్ కార్డులు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాకు 5,32,570 క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులు మంజూరు అయ్యాయని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది ద్వారా సంబంధిత కార్డు దారులకు పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. స్థానిక ఎన్టీఆర్ షాదీఖానాలో బుధవారం స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరై కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ విశ్వనాథ్, డీఎస్ఓ రవిబాబు పాల్గొన్నారు.